క్లుప్తంగా

7న కలెక్టరేట్ ఎదుట ధర్నా

శంకరపట్నం : తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేయనున్నట్లు మధ్యాహ్న భోజన నిర్వహణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బొజ్జ సాయిలు తెలిపారు. మండలంలోని కేశవపట్నంలో బుధవారం మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమావేశం జరిగింది. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామన్నారు. సక్రమంగా బిల్లులు, వేతనాలు రావడం లేదన్నారు. రూ.3వేల వేతనం పెంచుతున్నట్లు అసెంబ్లీలో ప్రకటించిన ప్రభుత్వం అమలు చేయడం లేదని, సమస్యల సాధన కోసం ఈనెల10 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమట్ల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకులు

జమ్మికుంట: రాష్ట్ర బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బుధవారం ఆయన నివాసంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్, బీజేపీ శ్రేణులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇక్కడ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, ఇల్లందకుంట సర్పంచ్ కంకణాల శ్రీలత–సురేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మహమ్మద్ షఫీ, సాంబయ్య, శ్రీనివాస్, రాజు, పవన్ రెడ్డి ఎగ్గెటి హరీశ్, ఎండీ జానీ, సుధాకర్ రెడ్డి, సాయిరెడ్డి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

తాటి, ఈత చెట్ల తొలగింపుపై ఫిర్యాదు

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామంలో తాటి, ఈత చెట్లను జేసీబీతో తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు బుధవారం గీతకార్మిక సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు గుర్రం భిక్షపతి గౌడ్ ఫిర్యాదు చేశారు. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన కొంకటి చంద్రయ్య, తీగల రఘుపతి, మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన ఏనుగుల యాదగిరి 25 ఈత, తాటి చెట్లను జేసీబీతో తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జూన్12, 17న ఎక్సైజ్ సీఐ, ఎస్సైలకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ లైన్ పనులు ప్రారంభం



గుంతలు తీస్తున్న యంత్రం

మానకొండూర్: మండలకేంద్రంలో తారు రోడ్డు నిర్మాణంలో భాగంగా బుధవారం విద్యుత్ లైన్ల పనులు ప్రారంభమయ్యాయి. మానకొండూర్ పెద్ద చెరువు వద్ద ఉన్న మెయిన్ రోడ్డు నుంచి కూరగాయల మార్కెట్ మీదుగా తూర్పు దర్వాజా వరకు తారురోడ్డు నిర్మాణం కోసం రోడ్డుకిరువైపులా ఇళ్ల నిర్మాణాలను కొన్నినెలల క్రితం కూల్చి ప్రజల సౌకర్యార్థం రోడ్డు విస్తరణ చేపట్టారు. బుధవారం మానకొండూర్ చెరువు కట్ట నుంచి తూర్పు దర్వాజ వరకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం సిబ్బంది పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్ ఎంపీటీసీలు పిట్టల మమత, ఉండింటి సులోచన, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మండలంలో అభివృద్ధి శూన్యం'

గన్నేరువరం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలంలో చేసిన అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ నాయకులు బొడ్డు సునీల్ అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం ఏమైందని ప్రశ్నించారు. మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు స్లాబ్ లెవల్‌లో నిలిచిపోయాయని తెలిపారు. రూ. 50 లక్షలతో అరుంధతి కల్యాణ మండపం ఊసే లేదన్నారు. అంతర్గత రహదారుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



హుజూరాబాద్ రూరల్ : మండలంలోని కందుగుల ప్రభుత్వ పాఠశాలలో గ్రామానికి చెందిన ఇప్పలపల్లి మనోహర్ తన కుమారులు శివరాం, హరికృష్ణల జ్ఞాపకార్థం బుధవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేందర్, ఎస్ఎంసీ చైర్మన్ రాజేందర్, సర్పంచ్ ప్రభావతి, ఉపసర్పంచ్ రాజయ్య, ఎంపీటీసీ కాసదం పద్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గర్శకుర్తి మండల ఏర్పాటెప్పుడో ?

- నెరవేరని సీఎం కేసీఆర్ హామీ
- గతంలో మంత్రి కేటీఆర్, అధికారులకు వినతి
- 67 రోజులుగా నిరాహార దీక్ష



గర్శకుర్తి గ్రామం

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామ మండల ఏర్పాటుకు ఏళ్ల గడుస్తున్నా మోక్షం లభించడం లేదు. పరిపాలనా సౌలభ్యం కోసం మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో దాదాపు పది నుంచి పన్నెండు గ్రామాలను విభజించి గర్శకుర్తి గ్రామం కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలనే స్థానికుల ఆశలు, ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ అమలుకు నోచుకోవడం లేదు. దీంతో గ్రామస్తులు మండలసాధన కమిటీ ఏర్పాటు చేసి నిరాహార దీక్షకు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 30వ తేదీ నుంచి చేపట్టిన నిరాహార దీక్ష 67వ రోజుకు చేరింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2016లో ప్రభుత్వం కొత్త జిల్లాలు, కొత్త మండలాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అదే సమయంలో గర్శకుర్తి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నిరాహార దీక్షలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మంత్రి కేటీఆర్, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులు తమ ప్రయత్నాలు మాత్రం విరమించలేదు. మండల ఏర్పాటుపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గర్శకుర్తితో పాటు, బూర్గుపల్లి, రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేటను మండలంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం తరుచూ కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేస్తున్నా చొప్పదండి నియోజకవర్గంలో కొత్త మండలాల ఏర్పాటుకు మోక్షం లభించడం లేదు.

అమలుకు నోచుకోని సీఎం హామీ..

గర్శకుర్తి గ్రామాన్ని మండలకేంద్రం చేస్తానని సీఎం కేసీఆర్ హామీ అమలుకు నోచుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్ ఎంపీగా పోటీచేసిన సమయంలో గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వచ్చినపుడు తెలంగాణ ఏర్పాటు తర్వాత గర్శకుర్తిని మండలంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.



నిరాహార దీక్షలో మండల సాధన కమిటీ నాయకులు

మండలం ఏర్పాటు చేయాలి



ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న గర్శకుర్తి గ్రామాన్ని వెంటనే ప్రభుత్వం మండలంగా ప్రకటించాలి. కొత్త మండలాలు ప్రకటిస్తున్న ప్రతిసారి మా ఊరి పేరు వస్తుందని ఆశపడ్డాం. మండల ప్రకటన రాకపోవడంతో మండల సాధన కోసం రెండు నెలల నుంచి నిరాహార దీక్షలు చేస్తున్నాం.

– పొత్తూరి సురేశ్, గ్రామస్తుడు

అనుకూలం



కార్మిక క్షేత్రమైన గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల పది పన్నెండు గ్రామాలకు అనుకూలంగా ఉంటుంది. అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు మండల ఏర్పాటుపై సానుకూలంగా ఉన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలి.

– అలువాల శ్రీనివాస్, గర్శకుర్తి

గ్రామాభివృద్ధికి కృషి

- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్
- పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సైదాపూర్: మండలంలోని ఎలబోతారంలో పలు అభివృద్ధి పనులకు హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ బుధవారం భూమిపూజ చేశారు. నూతన గ్రామ పంచాయతీ భవనం, పల్లె దవాఖాన భవనాలకు, సీసీరోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి కృషి ఎమ్మెల్యే సతీశ్ కుమార్ హామీఇచ్చారు. అనంతరం రాములపల్లిలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపుకు కార్యకర్తలు అహర్నిషలు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మ్యాకల శిరీష, ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బిల్లా వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శివకేశవాలయానికి టీటీడీ నిధులు

- అభివృద్ధి పనులకు రూ. 10 లక్షల కేటాయింపు



టీటీడీ ప్రతినిధితో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, నాయకులు

చొప్పదండి: పట్టణంలోని పురాతన శివ కేశవాలయంలో అభివృద్ధి పనులకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరు కానున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ తెలిపారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ టీటీడీకి రాసిన లేఖకు స్పందించిన దేవస్థానం అధికారి డాక్టర్ రామనాథం బుధవారం చొప్పదండిలోని శివ కేశవాలయాన్ని సందర్శించారు. చాకుంటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరడంతో చాకుంటలో సదరు అధికారి పర్యటించారు. చైర్మన్‌తో పాటు ఆలయ అర్చకులు, వివేకానంద యూత్ క్లబ్ సభ్యులు ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమలో అర్చకులు సత్యనారాయణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, దండె శ్రీనివాస్, మాంచాల మోహన్, గోవులకొండ అంజనేయులు, మావురం మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు అండగా ఉంటా

- ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి

ఇల్లందకుంట: ముదిరాజ్ కులస్తులకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని శ్రీ రాములపల్లి పెద్దమ్మ తల్లి విగ్రహావిష్కరణ, బోనాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిని నమ్మవద్దన్నారు. అనంతరం ఆలయ నిర్మాణానికి రూ. లక్ష చెక్కును అందజేశారు. సర్పంచ్ మొగిలి, నాయకులు సరిగొమ్ముల వెంకటేశ్, దేశిని కోటి, ఉపసర్పంచ్ రవికుమార్, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సన్మానం



గన్నేరువరం: మండలకేంద్రానికి చెందిన అక్కాచెల్లెళ్లు వేముల సుశ్మిత, వేముల సుప్రియ బాసర ట్రిబుల్ ఐటీలో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలను సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను వారి స్వగృహంలో బీజేపీ మండలాధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి జాలి శ్రీనివాస్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సత్తయ్య, బండి తిరుపతి, మండల సోషల్ మీడియా కన్వీనర్ మురళికృష్ణ, బుర్ర సత్యనారాయణ, హరీశ్, వొళ్లల తిరుపతి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో మోసపోతున్న రైతులు

గన్నేరువరం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు మోసం జరుగుతోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంటి వద్దే మద్దతు ధర దక్కాలనే ఉద్దేశంతో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిగ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. నేడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మిల్లర్లతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతుకు ఇచ్చే తక్ పట్టి, రైతుకు బ్యాంకులో జమచేసే డబ్బులకు సంబంధం లేకుండా ఉందని, సంబంధిత శాఖా మంత్రి, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి రాజీవ్ రహదారి దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ గంప మహేశ్, రైతులు మైపాల్ రెడ్డి, కొమురయ్య, రవి, తిరుపతి పాల్గొన్నారు

ఆర్థికసాయం అందజేత

చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్త బోయిని ఎల్లయ్య గుండెపోటుతో మృతిచెందాడు. బుధవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మామిడి అంజయ్యకు ఆదేశాలు జారీచేశారు. దీంతో అంజయ్య పార్టీ శ్రేణులతో కలిసి ఎల్లయ్య కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. ఆయనవెంట మండల రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ పెనుకుల తిరుపతి, సర్పంచ్ జక్కుల రవి, గ్రామశాఖ అధ్యక్షుడు బోయిని రమేశ్, నాయకులు షరీఫ్, కొమురయ్య, కృష్ణ, చందర్ రాములు, పలువురు ఉన్నారు.

పోలింగ్‌కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేఖ



పోలింగ్ బూత్‌లో వసతులను పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లందకుంట: మండలంలోని ఇల్లందకుంట, శ్రీ రాములపల్లి, కనగర్తి, లక్ష్మాజిపల్లి, మల్యాల పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ సురేఖ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలను సందర్శించామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి విడుపు శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది. ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, పన్యనాయక్, ఈశ్వర్‌రెడ్డి, కిషన్‌రావు, రాజయ్య, విజేందర్ రెడ్డి, రవీందర్, భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానకొండూర్ మండలంలో..

మానకొండూర్: మండలంలోని పలు గ్రామాల్లోని 78 పోలింగ్ బూత్‌ల్లో వసతులను తహసీల్దార్ లక్ష్మారెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శనరావు, పంచాయతీరాజ్ ఏఈ తిరుపతి, మండల విద్యాధికారి మధుసూదనాచారి పరిశీలించారు. పోలింగ్‌కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, వికలాంగుల కోసం ర్యాంపు సౌకర్యం, తాగునీటి వసతి, పరిశీలించారు. సమస్యలున్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి, సైదాబాద్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజేశ్వరి పరిశీలించారు. పాఠశాలలోని కేంద్రాల్లో విద్యుత్, పర్నీచర్, నీటివసతి, వృద్ధులు, దివ్యాగుల కేంద్రానికి చేరుకునేందుకు ర్యాంపుల ఏర్పాట్లపై ముందస్తుగా పరిశీలించారు. ఎంఈవో విడుపు శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది, ప్రధానోపాధ్యాయురాలు కాత్యాయిని, ఉపాధ్యాయులు ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి ఎంపిక పోటీలు



శంకరపట్నం : పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండలస్థాయి క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపిక పోటీలను ప్రధానోపాధ్యాయురాలు సుమలత బుధవారం ప్రారంభించారు. మండలస్థాయిలో రాణించిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు కన్వీనర్ బాబు శ్రీనివాస్ తెలిపారు. పోటీల్లో మండలంలోని గన్నేరువరం, జంగపల్లి, హన్మాజిపల్లి, ఖాసీంపేట పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాయామ, విద్య ఉపాధ్యాయులు పి. రాజబాబు, అశోక్, జ్యోతి, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శంకరపట్నం : మెట్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండలస్థాయి క్రీడాపాఠశాల ప్రవేశాలకు ఎంపికపోటీలు నిర్వహించారు. 4, 5 వతరగతి చదువుతున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఎంఈవో నర్సింహారెడ్డి, పీఈటీలు శోభారాణి, హరికిషన్, రమేశ్ పాల్గొన్నారు.

ముగిసిన ఎంపిక పోటీలు..

హుజూరాబాద్ : మండలస్థాయి క్రీడాపాఠశాల ఎంపికపోటీలు ముగిసినట్లు మండల విద్యాధికారి వెంకట నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడ్రోజులుగా జరిగిన ఎంపికపోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయికి ఎంపికచేయనున్నట్లు తెలిపారు. ఈనెల 10, 11న కరీంనగర్‌లోని బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికపోటీలు జరుగుతాయన్నారు. మండలంలోని సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు మండల ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సారయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పీఎం ప్రవీణ్, వై. రవికుమార్ సీహెచ్. శ్రీనివాసరావు ప్రవీణ, భాగ్యలక్ష్మి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జమ్మికుంటలో..

జమ్మికుంట: పట్టణంలోని బాలుర పాఠశాల మైదానంలో ఎంఈవో విడుపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పాఠశాల విద్యార్థుల ఎంపిక బుధవారం ముగిసింది. పట్టణం, మండలంలోని పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఐదో తరగతి నుంచి ఏడుగురు, నాలుగో తరగతి నుంచి ముగ్గురు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పీఈటీఏ అధ్యక్షుడు సారయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదానందం, కన్వీనర్ రేణుక, పీఈటీలు ప్రేమలత, శేఖర్, సత్యనారాయణ, శ్రీను, సుమన్, రాజేందర్, ఉమా, తిరుమల, సీఆర్‌పీ సురేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సాగునీరు అందించడంలో విఫలం'

చిగురుమామిడి: సాగునీటి ప్రాజెక్టుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటాలే తప్ప రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని గాగిరెడ్డిపల్లిలో పల్లెపల్లెకు ప్రవీణన్న, గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆయన కార్యకర్తలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఎగురవేశారు. ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్‌పార్టీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రుణమాఫీ చేయలేదని, పేదలకు డబుల్ బెడ్‌రూం అందించడం లేదన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, అధికార ప్రతినిధులు ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, దాసరి ప్రవీణ్‌కుమార్, మండలపార్టీ అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు నరాల రాజయ్య, జిల్లా యూత్ కార్యదర్శి బోయిని నరేశ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు కాంతాల మహిపాల్‌రెడ్డి, నాయకులు షాబుద్దీన్, ఓరుగంటి భారతిదేవి, బోయిని వేణు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

అఖండ హరినామ సంకీర్తనలో కాట్నపల్లి భక్తులు



అఖండ భజన చేస్తున్న కాట్నపల్లి భక్తులు

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన భక్తాంజనేయ భజన మండలి సభ్యులు బుధవారం తిరుమలలో జరిగిన అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్నారు. భజన మండలి అధ్యక్షులు గన్ను నర్సింహరెడ్డి, గాజంగి రాజేశం, బండారి మల్లేశం, రాములు, బిల్ల రమేశ్, బండారి శంకర్, వీరయ్య, ఎల్లెంకి మహేశ్, శంకర్, పొన్నం రాజు, బాలరాజు, తదితరులు నిరంతర భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏటా స్వామివారి కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

ప్రహరీ కూల్చివేత వివాదాస్పదం

- పాఠశాల స్థలం ఆక్రమిస్తున్నాడని ఆరోపణలు



పాఠశాల స్థలం పక్కన కూల్చివేసిన ప్రహరీ

చొప్పదండి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం పక్కనే ఉన్న ఓ ఇంటి యజమాని తన ప్రహరీ కూల్చివేయడం వివాదాస్పదమైంది. ఇప్పటికే పాఠశాల క్రీడా మైదానం ఆక్రమించి పలువురు నిర్మాణాలు చేశారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సదరు యజమాని తన ప్రహరీ గోడను కూల్చివేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలే నిర్మాణమైన ఓపెన్ జిమ్ పక్కన ప్రహరీ కూల్చి తనకు పాఠశాల ఆధీనంలో ఉన్న మరికొంత స్థలం కలుపుకొనేందుకే గోడను కూల్చివేశారని ఆరోపణలు వస్తున్నాయి. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చీకట్ల కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణ ఈ వ్యవహారాన్ని పోలీసులు, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ అధికారులు ప్రహరీ కూల్చివేతను పరిశీలించినట్లు తెలిసింది. పాఠశాల స్థలం కబ్జా చేసేవారిపై చర్యలు తీసుకోవాలని పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

- టాప్రా మండల ప్రధాన కార్యదర్శి కట్ట నాగభూషణాచారి

జమ్మికుంట: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టాప్రా (తెలంగాణ అల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షర్స్ అసోసియేషన్) మండల ప్రధాన కార్యదర్శి కట్ట నాగభూషణాచారి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎస్‌టీవో కార్యాలయం వద్ద టాప్రా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో లేదీన పెన్షన్లు బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని, డీఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం ఎస్‌టీవో కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గరిగె చంద్రయ్య, పెన్షనర్లు రామస్వామి, ఎండీ రహీం, రామచంద్రం, కృష్ణమూర్తి, సార భద్రస్వామి, దేవయ్య, మునీరుద్దీన్, రామకిష్టం, గంగయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.